క్లుప్తంగా

విద్యార్థినుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రాఘవకుమారి

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయం జూన్‌లో ఉన్నత విద్య ప్రవేశం కోసం నిర్వహించిన పీజీ సెట్‌లో ప్రతిభ కనబరిచారు. ఆ వివరాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి మంగళవారం తెలిపారు. యు.త్రివేణి 144, ఎస్.గీత ఉమాదేవి 186, వై.భువనేశ్వరి 192, బి.పవిత్ర 209, కె.నాగ సుప్రియ 251, వీవీఎస్.భవాని 328, ఎం.దివ్య ప్రసన్న 345, వి.సుజన్ గ్రేస్ 503, జి.గౌతమి దుర్గ 512, ఎస్.స్రవంతి 525, ఎమ్.ఆశ్రిత 767 ర్యాంకులు సాధించారన్నారు. అత్యున్నతమైన ప్రతిభను కనపర్చిన ఆ విద్యార్థినులను, సైన్స్ అధ్యాపకులు ఎస్.మౌనిక మహద్, బి.భువనేశ్వరిని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అభినందించారు.

విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న ఎస్ఆర్ పృథ్వీ

రాజమహేంద్రవరం రూరల్: పృథ్వీ వెంకటరాజు జయంతి సందర్భంగా పీవీఆర్ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖకవి ఎస్ఆర్ పృథ్వీ మంగళవారం హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన రావూరి సుముయోన్, రెడ్డి శ్రీవల్లిక, దేవళ్ల తనూజ వరలక్ష్మికి నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, తను రాసిన పుస్తకాలు అందజేశారు. అనంతరం పాఠశాల తరఫున ఎస్ఆర్ పృథ్వీని ప్రధానోపాధ్యాయుడు కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు సత్కరించారు.

సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో రెండో రోజు మంగళవారం డీఈఈసెట్ – 2023 సర్టిఫికెట్ల పరిశీలనకు 23 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 22 మందికి ఫైనల్ అడ్మిషన్ లెటర్లు అందజేశామన్నారు.

స్వచ్ఛంద సేవపై శిక్షణ

ప్రకాశం నగర్: సమాజసేవపై ప్రత్యేక కోర్సు ఏర్పాటు చేస్తే అనేక మంది సామాజిక సేవకులు తయారవుతారని స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అన్నారు. స్థానిక స్వర్ణాంధ్ర సేవాసంస్థలో మంగళవారం స్వచ్ఛంద సేవపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వివిధ యూనివర్సిటీలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోర్సు చేయడానికి స్వర్ణాంధ్రకు వస్తున్నారని, వారికి ఉచిత రీతిలో శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీవీ చౌదరి, తేజ, సత్య, మూర్తి, పవన్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ గాయత్రీదేవి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో పర్మనెంట్ లోక్‌అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ (ప్లపస్) సేవలు, వైవాహిక సమస్యలు, ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రెసల్యూషన్ ప్రక్రియపై మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయత్రీదేవి మాట్లాడుతూ న్యాయసేవాధికార సంస్థల చట్టం, 1987 ద్వారా స్థాపించబడిన పర్మనెంట్ లోక్ అదాలత్ విధులపై అవగాహన కల్పించారు. విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్యం, తపాలా, టెలిఫోన్, బీమా సంస్థలు, బ్యాంకింగ్ మొదలగు వివాదాలను పరిష్కరించుకోవచ్చన్నారు.

బూత్ ఏజెంట్లకు శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిగ్రేటెడ్ శిక్షణను బూత్ ఏజెంట్లు సక్రమంగా ఉపయోగించుకుని, రాబోయే ఎన్నికలలో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. హుకుంపేటలోని గోదావరి రుచులు ఫంక్షన్ హాల్లో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో రూరల్ మండల ఏజెంట్లకు శిక్షణ నిర్వహించారు. సిటీకి సంబంధించి హోటల్ జగదీశ్వరిలో సమావేశం జరిగింది.

చినుకు పడితే మునకే..

- కృష్ణారావుపేటలో దుస్థితి
- అవస్థలు పడుతున్న ప్రజలు



ముంపునకు గురైన కృష్ణారావుపేట ప్రాంతం



రోడ్డుపైకి చేరిన ముంపునీరు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ పరిధి 27వ డివిజన్‌లోని ఇన్నీసుపేట కృష్ణారావుపేట ప్రాంతం వర్షం కురిస్తే జలమయమవుతోంది. సుమారు ఏడు వీధులు ముంపుబారిన పడుతున్నాయి. రోడ్లు ఎత్తు పెంచకపోవడంతో పాటు, ప్రధాన డ్రైనేజీలో పూడిక సమయానికి తీయకపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణారావుపేట దుర్గాలమ్మగుడి ప్రాంతంలోని ఏడు వీధుల్లో సుమారు 1,800 కుటుంబాలు నివసిస్తున్నాయి. కృష్ణారావుపేటకు ఆనుకుని ఎస్‌టీప్లాంట్‌కు మురుగునీరు వెళ్లే ప్రధాన డ్రైనేజీ ఉంది. వేసవి కాలంలో తరచూ నగరపాలకసంస్థ అధికారులు పూడిక తీస్తుంటారు. అయితే ఈ ఏడాది సిల్టును తొలగించలేదు. దీనివల్ల వర్షం వస్తే చాలు ఈ ప్రాంతం నీటమునిగిపోవడం పరిపాటిగా మారింది. ఈ ప్రాంతవాసులు దాదాపు 25 ఏళ్లుగా ముంపు సమస్యతో బాధపడుతున్నారు. వర్షం వస్తే చాలు ఏడు వీధులు మునిగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం తగ్గిన ఒకపూటకు గానీ నీరు లాగడం లేదు. ముంపు కారణంగా దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. జ్వరాలు విజృంభిస్తాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలకసంస్థ అధికారులు స్పందించి, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.

రోడ్లు ఎత్తు చేయాలి



కృష్ణారావుపేట ప్రాంతంలో వర్షం వస్తే చాలు ముంపు సమస్య తలెత్తుతోంది. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడు వీధులలో రోడ్లను ఎత్తు చేస్తే ముంపు సమస్య కొంతమేర తగ్గుతుంది.

– రావర్తి నాగలక్ష్మి, కృష్ణారావు నగర్

పూడిక తొలగించాలి



ఎస్‌టీ ప్లాంట్‌కు వెళ్లే ప్రధాన డ్రైనేజీ కృష్ణారావు నగర్ వెంబడి ఉంది. ఏటా వేసవిలో ఆ డ్రైనేజీలో పూడిక తీస్తుంటారు. ఈ ఏడాది తీయకపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. నగరపాలకసంస్థ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలి.

– సబ్బెళ్ల విజయ దుర్గారెడ్డి, 27వడివిజన్

వలంటీర్లకు వందనం

సేవలు స్ఫూర్తిదాయకం



విశాఖపట్నం కేజీహెచ్‌లో అప్పారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కర్ణం ఎంవీ లక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరంలోని ఎర్రకొండ నేతాజీ నగర్ ప్రాంతానికి చెందిన గొంతిన అప్పారావు అనారోగ్యంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయనకు వలంటీర్ కర్ణం ఎంవీ లక్ష్మి విశాఖకు వెళ్లి కేజీహెచ్ ఆసుపత్రిలో వృద్ధాప్య పింఛన్ అందించింది. ఆయనకు పింఛన్ సొమ్ము ఆసరాగా ఉంటుందన్న మానవతా దృక్పథంతో వలంటీర్ లక్ష్మి సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి అందించడంపై అప్పారావు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. వలంటీర్‌ను పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

అంధురాలికి ఆసరా..



అంధురాలు రమణమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ అనంతలక్ష్మి

నగరపాలకసంస్థ పరిధి 16వ డివిజన్‌లో ఆవరోడ్డులో ఉండే తన్నీరు వెంకట రమణమ్మకు వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ పట్నాల అనంతలక్ష్మి అందించేది. ఆమెకు కొంతకాలానికి చూపుమందగించి కనిపించడం లేదు. దీంతో వెంకటరమణమ్మ గోకవరం బస్టాండ్ ప్రాంతంలో కుమారుడు, మనువరాలి వద్దకు వెళ్లిపోయింది. అయినప్పటికీ వలంటీర్ అనంతలక్ష్మి ప్రతి నెలా ఒకటో తేదీన వెంకట రమణమ్మకు వేలిముద్రలు, ఐరిష్ పడకపోవడంతో ఆర్‌బీఐఎస్ యాప్ ద్వారా పింఛన్ అందజేస్తుంది. తమ ప్రాంతం కానప్పటికీ రమ్మణమ్మకు పింఛన్ అందించడం సంతృప్తిగా ఉందని వలంటీర్ చెబుతోంది.

జగనన్న సురక్షతో సేవలు వేగవంతం

- ఎంపీ భరత్ రామ్
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్



పిడింగొయ్యిలో పత్రాలు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని 37, 38, 43 వార్డులలో మంగళవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల కారణంగా ప్రజలు తీవ్రంగా నలిగిపోయేవారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎటువంటి పనులూ జరిగేవి కావన్నారు. కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సమర్థవంతమైన పాలన అందాలన్న సదాశయంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. ఏ అవసరం ఏర్పడినా ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లకుండానే వలంటీర్ల ద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని సదుపాయాలు కలుగజేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చక్కని పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవాలు లేవన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ భాస్కర్, ఎస్ఐ అమీనా బేగం, క్లస్టర్ ఇన్‌చార్జులు మజ్జి అప్పారావు, బర్రె కొండబాబు, 37, 38, 43 వార్డు ఇన్‌చార్జులు ఇసుకపల్లి శ్రీనివాస్, అరిగెల బాబు, హసీనా బేగం, గూడూరి రాధిక, దుంగా మంగాలక్ష్మి, బాలాజీ రెడ్డి, సుబ్బవరపు సూరిబాబు, సుందర్‌సింగ్ సోడదాసి పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగన్

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. పిడింగొయ్యి సచివాలయం3లో మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే సీఎం జగన్ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎస్ జ్యోతి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 1,650 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.రూప్‌చంద్, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, చీరారాజు, సుందరపల్లి అనిల్, పడాల వీరరాఘవరెడ్డి, కడితి లక్ష్మీనారాయణ, ఇబ్రహీం పాల్గొన్నారు.

కాతేరు సచివాలయం 5లో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎస్ జ్యోతి, సచివాలయ కన్వీనర్లు యెజ్జు వాసు, గూడూరి సురేష్, దార్ల రాము చేతుల మీదుగా 2,400 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట కళ్యాణ్, కొత్తపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రకాశం నగర్: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి గోల్డెన్ జూబ్లీ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం స్థానిక వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో మాజీ చైర్మన్ పట్టపగలు అనంత రామలక్ష్మి అధ్యక్షతన జరిగింది. నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన కొండా ఝాన్సీకి పట్టపగలు అనంత రామలక్ష్మి ఇన్నర్ వీల్ కాలర్ వేసి పదవీ బాధ్యతలు అప్పగించారు. కార్యదర్శిగా బి.రాణి, కోశాధికారిగా ఉష, ఐఎస్ఓగా జి.అన్నపూర్ణ, ఎడిటర్‌గా వి.భద్రావతి, క్లబ్ డైరెక్టర్లుగా పి.అనంత రామలక్ష్మి, ఎస్.కమలా నెహ్రూ, పి.సునంద ప్రమాణ స్వీకారం చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశం

సీటీఆర్ఐ: స్థానిక ఎన్జీఓ హోమ్‌లో వివిధ కార్మిక సంఘాల నాయకులతో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కార్మికులపై ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు పాల్గొన్నారు.

ఎస్వీఆర్‌కు నివాళి

ధవళేశ్వరం: సినీనటుడు ఎస్వీ రంగారావు వర్ధంతి సందర్భంగా మంగళవారం ధవళేశ్వరం బ్యారేజీ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీరంగం బాలరాజు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, మరిసా ప్రకాష్, మట్టపర్తి నాగరాజు, దూది సాయి, ప్రసాదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పన్నులు ఉపసహరించుకోవాలి

ప్రకాశం నగర్: రవాణా వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు తాటిపాక మధు, కె.రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయములో మంగళవారం ఏఐటీయూసీ అనుబంధంగా ఆటో వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేశారు. మధు, రాంబాబు మాట్లాడుతూ ఆటోలపై రోడ్డు, లేబర్, గ్రీన్‌ట్యాక్సులు రద్దు చేయాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక సుబ్బారావు నగర్‌కు చెందిన బి.రాజేష్ అదృశ్యంపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. గత నెల 13వ తేదీన తన కుమారుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని తల్లి రాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇటుకల లోడు ట్రాక్టర్ బోల్తా

కడియం: మండలంలోని కడియపులంక వద్ద జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఇటుకల లోడు ట్రాక్టర్ బోల్తా పడింది. రావులపాలెం వైపు నుంచి వేమగిరి వైపునకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటుకల లోడుతో ట్రాక్టర్ కడియపులంక పువ్వుల మార్కెట్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపైనే బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో పెద్దగా వాహనాలు హైవేపై రాలేదు. డ్రైవర్ ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ట్రాక్టర్ యజమానులు మరో ట్రాక్టర్‌ను తీసుకువచ్చి రోడ్డుకు అడ్డుగా పడిన ఇటుకలను అందులోకి లోడుచేసి తీసుకువెళ్లారు.

చచ్చేలా కొడితే చర్యలు తీసుకోరేం..



రచ్చబండలో సమస్యలు వింటున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: అకారణంగా దాడి చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని పోలీసు అధికారులను ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. తమను అన్యాయంగా ఇంటి ఎదురుగా ఉన్న ఆసామి (లారీ డ్రైవర్) పరుష పదజాలంతో దూషిస్తూ, తమ కుటుంబ సభ్యులపై దాడి చేశాడని, తమ కుమారుడు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎంపీ వెంటనే సంబంధిత ఏరియా పరిధిలోని పోలీసు అధికారిని రచ్చబండ వద్దకు రప్పించారు. ఘర్షణకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గతంలో కూడా ఇదే విధంగా దాడి చేసినట్టు చెబుతున్నారని, మళ్లీ ఇప్పుడు దాడి చేసినా ఎందుకు బాధ్యులపై చర్య తీసుకోలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేసి, బాధ్యులను అరెస్టు చేయాలని సూచించారు. అలాగే దేవీచౌక్ ప్రాంతంలోని ఒక కుటుంబ సమస్యను పోలీసు అధికారుల దృష్టికి ఎంపీ తీసుకువెళ్లారు. ఆ దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి కాపురం నిలబెట్టాలని సూచించారు. హుకుంపేట పంచాయతీ పరిధిలోని అమ్మానాన్న వృద్ధాశ్రమానికి వెళ్లే మార్గం సక్రమంగా లేదని, సీసీ రోడ్డు వేయించాలని ఆశ్రమ నిర్వాహకుడు కోరారు. అలాగే వివిధ సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మిపాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ రమణ

రాజమహేంద్రవరం రూరల్: జీవన నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణాసంస్థ (డైట్) ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ అన్నారు. బొమ్మూరులోని డైట్‌లో మ్యాజిక్ బస్‌సంస్థ, ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై మంగళవారం రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎస్ఈఆర్‌టీ మానటరింగ్ టీమ్ మెంబర్ డేవిడ్ రేవంత్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. డైట్ వైస్ ప్రిన్సిపాల్ కేవీ సూర్యనారాయణ, స్టేట్ రిసోర్స్‌పర్సన్లు డి.సుజాతరత్నం, ఎల్.చూడామణి, డీఎస్‌వీ సత్యనారాయణ, మ్యాజిక్ బస్‌సంస్థ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ జి.జనార్దన్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తెగిపడి వ్యక్తి మృతి

- రెండు గేదెల దుర్మరణం



ఘటనా స్థలంలో సోమిరెడ్డి మృతదేహం

ధవళేశ్వరం: చెట్టుకొమ్మ పడడంతో విద్యుత్ తీగ తెగిపడి ఓ వ్యక్తి, రెండు గేదెలు మృతి చెందాయి. ధవళేశ్వరం రథం వీధికి చెందిన నల్లమిల్లి సోమిరెడ్డి (59) పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మూడు గేదెలను తోలుకువస్తుండగా గోదావరి గట్టు జీఎంఆర్ పంప్ హౌస్ సమీపంలో గాలికి విద్యుత్ తీగపై చెట్టుకొమ్మ పడింది. దీంతో విద్యుత్ వైరు తెగిపడి సోమిరెడ్డి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మూడు గేదెల్లో రెండు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. సోమిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసును ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి దర్యాప్తు చేస్తున్నారు.

పేపరుమిల్లు కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రకాశం నగర్: ఏపీ పేపర్ మిల్లు కార్మికుల సంక్షేమానికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. పేపర్ మిల్లు గేటు వద్ద మంగళవారం రాత్రి డాక్టర్ వైఎస్సార్ పేపర్ మిల్లు యూనియన్ కార్యవర్గం విజయోత్సవం నిర్వహించారు. బాణాసంచా, డప్పుల మోతతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ కార్యక్రమానికి సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎంపీ భరత్ రామ్, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏపీ పేపర్ మిల్లు కార్మికులకు వేతనాల విషయంలో న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మిల్లు లాభాల్లో ఉందని, ఆ లాభాలను తెచ్చే కార్మికులకు అన్యాయం చేయడం తగదని, ఈ విషయంలో సంఘ జనరల్ సెక్రటరీ ప్రవీణ్ చౌదరి తదితర ప్రతినిధులతో చర్చిస్తానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్మిక పక్షపాతని, ఆయన పాలనలో కార్మికులకు స్వర్ణయుగం అన్నారు. సిటీలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించి కార్మికుల ఐక్యత, సీఎం జగన్‌పై ఉన్న అభిమానాన్ని నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గూడూరి శ్రీనివాస్, కార్మిక సంఘ జనరల్ సెక్రటరీ ప్రవీణ్ చౌదరి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎన్వీ శ్రీనివాస్, పీతా రామకృష్ణ, బర్రే కొండబాబు, దుంగా మంగ, అరిగెల బాబు, విత్తనాల శివ, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.

ఉత్తరాల బట్వాడాలో పారదర్శకత

ప్రకాశం నగర్: తపాలా కార్యాలయాల్లో ఉత్తరాల బట్వాడాలో మరింత పారదర్శకత అందించే ఉద్దేశంతో మెయిల్ మానిటరింగ్ యూనిట్ (ఎంఎంయూ)ను స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కె.శ్రీధరం మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా ఎంఎంయూను ప్రారంభించామన్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ కోమల్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు ఇంపోర్టు అండ్ ఎక్స్‌పోర్టు లైసెన్స్ కోడ్ కలిగిన సంస్థలు ముఖ్య నగరాల్లోని హెడ్ పోస్టాఫీసుల్లో ఏర్పాటు చేసిన డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాల ద్వారా వస్తువులు, మందులు, గిఫ్టులు, ఇతర సామగ్రిని పంపవచ్చన్నారు. ఇంటి వద్ద నుంచే సులభ రీతిలో, శ్రమ లేకుండా విదేశాలకు వస్తువులను ఎగుమతి చేయవచ్చన్నారు. వివరాలకు 85005 90045 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మోదీ విధానాలపై పోరాడాలి

ప్రకాశం నగర్: 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్లను తెచ్చి, వాటిని అమలు చేస్తున్న మోదీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ట్రేడ్ యూనియన్ల ఐక్యవేదిక నిర్ణయించింది. జిల్లా కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవనంలో మంగళవారం జరిగిన సమావేశానికి ఏఐకేఎంఎస్ అధ్యక్షురాలు టాన్యా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రైతులకు నష్టం కలిగించే వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలన్నారు.

ఏబీవీపీ కన్వీనర్‌గా సత్యసాయి

ప్రకాశం నగర్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నగర కన్వీనర్‌గా ఆకుల సత్యసాయి నియమితులయ్యారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రాంత అభ్యాసవర్గ సమావేశంలో ఆయన ఎన్నిక జరిగింది.

21 కేజీల గంజాయి స్వాధీనం

ధవళేశ్వరం: విశాఖ ఏజెన్సీ నుంచి ధవళేశ్వరం తీసుకువచ్చి విక్రయిస్తున్న 21.600 కేజీల గంజాయిని మంగళవారం ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారయ్యాడు. వివరాలు ఇలా.. పది రోజుల క్రితం విశాఖ నుంచి నలుగురు వ్యక్తులు 25 కేజీల గంజాయిని ధవళేశ్వరం తీసుకువచ్చారు. చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం చెరుకూరి గార్డెన్స్ సమీపంలో దాచిన గంజాయిని నలుగురు నిందితులు పంచుకుంటుండగా ధవళేశ్వరం పోలీసులు దాడి చేశారు. ఎం.ధర్మరాజు కుమార్, ఎం.సూర్యకిరణ్, ఎండీ జమీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు టి.దొరయ్య పరారయ్యాడు. కేసును సీఐ కె.మంగాదేవి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి రెండేళ్ల జైలు

ధవళేశ్వరం: ఆటోను అతి వేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం కోర్టు తీర్పు ఇచ్చిందని ధవళేశ్వరం పోలీసులు తెలిపారు. 2015 అక్టోబర్ 17న హుకుంపేటకు చెందిన పూడి గౌరీ బంధువులతో కలిసి హుకుంపేటలోని ఇంటి నుంచి ఆటోలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి గుడికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి అదే ఆటోలో ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో ధవళేశ్వరం క్వారీ కెనాల్ రోడ్ గ్యాస్ కంపెనీ సమీపంలో డ్రైవర్ ఆటోను అతివేగంగా నడుపుతూ రోడ్డు పక్కనే ఉన్న లారీని ఢీకొట్టాడు. అందులో ప్రయాణిస్తున్న శివరపు దేవుడమ్మ, బర్ల కృష్ణమ్మ తీవ్ర గాయాలై మృతి చెందారు. దీనిపై అప్పటి హెచ్‌సీ ఐ.రామన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్సై నరసింహమూర్తి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ కె.మంగాదేవి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు. ఏపీపీ మహాలక్ష్మి వాదనలు వినిపించారు. నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష, రూ. పదివేలు జరిమానా విధిస్తూ జడ్జి పి.బాబు తీర్పు ఇచ్చారు.

ఆశా కార్యకర్తల ధర్నా

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఆశావర్కర్లపై పనిభారం తగ్గించాలని, సెలవలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలంటూ బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద మంగళవారం ఆశావర్కర్లు ధర్నా చేశారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కేతా పోసమ్మ, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఓ.అన్నామణి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.